# థాంక్స్

పరుగు పరుగున వచ్చి సిటీ బస్సెక్కాడు సుందరం. బస్సులో అప్పటికే ప్రయాణీకులు నిలబడి వున్నారు. సుందరం వెనకసీటులో పరీక్షగా చూశాడు. అయిదుగురే కూర్చున్నారు. న్యాయంగా ఆరుగురు కూర్చోవలసిన సీట్లలో అయిదుగురు విశాలంగా సర్దుక్కూచున్నారు.

సుందరానికి మండింది. 'మనవాళ్ళకి అసలు పౌరవిజ్ఞానం తెలియదు' తిట్టుకున్నాడు సుందరం.

సుందరం కాస్త ఒంగి జనాంతికంగా, "కాస్త సర్దుకోనండి మాష్టారూ! ఆరుగురం కూర్చోవచ్చు" అన్నాడు.

అయిదుగురూ అతడిని, "హౌరా! నీకు ఎంత తెగింపురా" అన్నట్టు చూచి జరగడం ఇష్టంలేనట్టు ఒకో అంగుళం మేర జరిగి నన్ను కానట్టు వూరుకున్నారు.

సుందరం ఖాళీలో సర్దుకు కూచున్నాడు.

బస్సు కదిలింది.

సుందరం కూచోవడంకంటె నిలబడుంటేనే బాగు అనుకున్నాడు. ప్రక్కనున్న లావుపాటి వ్యక్తి తన బరువైన తొడలు సుందరం మోకాళ్ళ మీదికి వచ్చేలాగా కూర్చుండి మోచేతుల్తో సుందరం డొక్కలో గుచ్చుతూ నిర్లిప్తంగా చూస్తున్నాడు.

స్టేజివచ్చింది. దాదాపు ముగ్గురు మనుషుల పాటి బరువు తూగే భారీ విగ్రహం బస్సెక్కి సుందరం కాళ్ళముందు నిలబడి వుస్సురంటున్నాడు.

సుందరం ఆ విగ్రహాన్నితట్టి, "రండిసార్! కూర్చోండి" అంటూ లేచి సీటు త్యాగంచేశాడు.

భారీ విగ్రహం కొండంత సంతోషంతో అయిదంగుళాల ఖాళీస్థలంలో చతికిలబడ్డాడు.

అయిదుగురిలోనూ చైతన్యం ప్రవహించింది. ముగ్గురికి సరిపడే చోటు రెప్పపాటులో భారీ విగ్రహానికి అమరింది.

సుందరాన్ని కృతజ్ఞతాపూర్వకంగా చూసింది భారీ విగ్రహం. "థాంక్యూ" అన్నాడు సుందరం కొంటెగా-జనాంతికంగా.

—ఎం. వి. వి. సత్యనారాయణ

# పశ్చాత్తాపం ధర

గ్రీక్ భాషలో ఒక సామెత వుంది—'ప్రతి ఒక్కడూ కొరింథ్ వెల చెల్లించలేడు' అని. దీని వెనుక ఒక కథ వుంది.

కొరింథ్ లూయిస్ ఒక వేశ్యపేరు. ఆమె అద్భుత సౌందర్యవతి. అలాగే చిటారుకొమ్మన మిఠాయి పొట్లంకూడా. గ్రీస్‌దేశం నలుమూలల నుండి ఆమె సౌందర్యం గురించి విని, ఎందరో ధనికులు ఆమె ఇంటికి వచ్చేవారు. తను అడిగినంత యిస్తేనేగాని, ఆమె ఎవరినీ ఇంట్లోకి అడుగుపెట్టనిచ్చేది కాదు. ఆమె అడిగిన వెల చెల్లించటమంటే సామాన్యుడికి తలక్రిందులా తపస్సు చేసినా సాధ్యపడేది కాదు. అందుకే పై సామెత పుట్టింది.

ఒకసారి డిమోస్థనీజ్ అనే ఒక వక్త కొరింథ్ యింటికి వెళ్ళాడు. ఆమె తనలాంటి వాడికి అందుబాటులో వుండదని తెలిసే, తెర వెనుక వున్న కొరింథ్‌ని ఒక కోరిక కోరాడు. ఒక్కసారి ఆమెని కౌగిలించుకొని, దాంతో తృప్తిపడి వెళ్ళిపోతానని అన్నాడు డిమోస్థనీజ్. దానికి కొరింథ పదివేల దీనారాలు వెల కట్టి ఆ డబ్బు ముందుగా యిచ్చి ఆ తర్వాత తనని కౌగిలించుకోవచ్చు నని చెప్పింది.

డిమోస్థనీజ్‌కి కొరింథ్ అహంకారం అర్థమయింది. ఆమె తనకి ఏమాత్రమూ అందుబాటులో లేదని గ్రహించాడు. వెంటనే అతడు, "ఇంత ధరపెట్టి పశ్చాత్తాపాన్ని కొనటానికి నేను సిద్ధంగా లేను!" అన్నాడు.

నక్క-ద్రాక్షపళ్ళ కథని గుర్తుచేస్తున్న ఈ కొరింథ్-డిమోస్థనీజ్ వుదంతం సోటియన్ అనే దార్శనికుడు వ్రాసిన 'ద హోర్న్ ఆఫ్ ప్లెంటీ' అనే పుస్తకంలో వుంది.

—సుంకర భాస్కరరావు